క్లుప్తంగా

చిన్నారుల చేతుల్లోనే భావిభారతం



ఆలమూరులో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ప్రసన్న

ఆలమూరు: నేటి చిన్నారుల చేతుల్లోనే భావి భారతం ఉందని ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది బూసి విద్యా ప్రసన్న, ముప్పిరి వెరియ్య అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలమూరు ఎస్సీ, బీసీ ఏరియాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన చిన్నారులకు నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులు రానున్న రోజుల్లో శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈదల నల్ల బాబు, రాంబాబు, రామానుజుల శేషగిరిరావు, కడియాల శ్రీను, కేతా రాంబాబు, నెల్లి చిన్న, దిడ్డి రాము, లంక శ్యామ్, న్యాయవాది గోవింద రాజు దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళాల వెల్లువ



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కిశోర్‌కుమార్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్ కుమార్ తెలిపారు. పాలకొల్లుకు చెందిన తటవర్తి సుధాకర్‌రావు, లక్ష్మి శారదదేవిలు స్వామివారికి తిరుచి వాహనం సమర్పించారు. వాడపల్లి గ్రామానికి చెందిన ఎరుబండి రాజు, సూర్యకుమారి దంపతులు విష్వక్సేనుడికి సుమారు 200 గ్రాముల వెండి కిరీటం అందించారు. తేతలికి చెందిన సోమసుందరరెడ్డి సుధా దంపతులు కిలో వెండి కిరీటం సమర్పించారు. దాతలకు ఈఓ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

సామాజికవేత్తకు అల్లూరి అవార్డు



కుమార్‌కు అల్లూరి రజతోత్సవ అవార్డును అందజేస్తున్న దుళ్ల వెంకటేశ్వరరావు

రావులపాలెం: ప్రముఖ సామాజికవేత్త ఐఈ కుమార్‌కు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ రజతోత్సవ అవార్డును గురువారం అందించింది. ఊబలంకలో సంస్థ ఆవిర్భవించి నేటికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ రజతోత్సవ అవార్డును సంస్థ ఫౌండర్ దుళ్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సామాజికవేత్త, అన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఐఈ కుమార్‌కు ప్రదానం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఈ కుమార్ గతంలో ఊబలంక మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలకు సుమారు రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. అన్నా మినిస్ట్రీస్ సంస్థను ప్రారంభించి 30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని గుర్తు చేశారు.

గురుకుల పాఠశాలకు గీజర్ బహూకరణ



నరేంద్రపురం గురుకులంలో కలాం ట్రస్టు చైర్మన్ భీమాలను సత్కరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాలకు పి.గన్నవరం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా రూ.15 వేల విలువైన వాటర్ ట్యాప్‌లు, గీజర్ బహూకరించారు. అలాగే పాత గ్రీజర్లకు మరమ్మతులు చేయించారు. ట్రస్టు చైర్మన్ భీమాలను పాఠశాల అధ్యాపక సిబ్బంది సత్కరించారు. నాగుల్లంక పాఠశాలలో సీపీ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు వ్యవస్థాపకులు పి.చిట్టిబాబు ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు టిఫిన్ బాక్సులు అందించారు. సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి పాల్గొన్నారు.

సినీ హీరో శ్రీహరికి నివాళి

అంబాజీపేట: సినీ హీరో శ్రీహరి జయంతిని అంబాజీపేటలో గురువారం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న శ్రీహరి విగ్రహానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచారు. నూదాబత్తుల రాము, తాజా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పళ్ల సూర్యప్రకాశరావు (బాబ్జి), కామిశెట్టి మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ



కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు



పినపళ్లలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న పేపర్‌మిల్లు యాజమాన్యం



ఆత్రేయపురం సీతారామరాజు సెంటర్ వద్ద జెండా వందనం..



అంబాజీపేటలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

దేశభక్తి చాటేలా.. మది మురిసేలా..

- వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం
- త్యాగధనులను స్మరించుకుంటూ వేడుకలు

కొత్తపేట: మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.. ప్రతి గుండెలోనూ దేశభక్తిని నింపింది.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో గురువారం వేడుకలు జరుపుకొన్నారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా స్వాతంత్ర్యం సాధించిందని ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. కొత్తపేట కాంతిభారతి విద్యా సంస్థల ప్రాంగణంలో కరస్పాండెంట్ తోట సత్యవాణి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఆర్డీఓ సత్యనారాయణ, అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా డివిజనల్ రెవెన్యూ కార్యాలయం వద్ద, శ్రీనాథ రత్నశిల్పి వుడయార్ శిల్ప కళా సాంస్కృతిక సేవా సంస్థ ప్రాంగణంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు ఆర్డీఓ పూలమాలలు వేశారు. వాడపాలెం, కొత్తపేట పంచాయతీ కార్యాలయాలు, పీఏసీఎస్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో సమరయోధుల స్తూపానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు పూలమాలలు వేశారు. వాడపాలెంలో బండారు సందీప్ వైద్య సేవా ట్రస్ట్ భవనం వద్ద జాతీయ పతాకాన్ని ట్రస్ట్ చైర్మన్ బండారు చిట్టిబాబు ఆవిష్కరించారు.

రావులపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే సత్యానందరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు సమకూర్చిన నగదుతో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.20 వేలు, ద్వితీయ స్థానం విద్యార్థికి రూ.10 వేలు, తృతీయ స్థానం విద్యార్థికి రూ. 5 వేలు అందజేశారు. దేవరపల్లి హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో జెడ్పీటీసీ పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ. 10 వేలు అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను జెడ్పీటీసీ శ్రీనివాసరావు, పార్టీ జెండాను మండల కన్వీనర్ దొమ్మేటి అర్జునరావు ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కర్రి లక్ష్మివెంకట నాగదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యాకమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డిలు జాతీయ జెండాలను ఎగురవేశారు. మండలంలోని వివిధ పంచాయతీల వద్ద, పాఠశాలల వద్ద, అరటి మార్కెట్ యార్డు, తదితర చోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ కర్రి లక్ష్మివెంకటనాగదేవి, సర్పంచులు తాడేపల్లి నాగమణి, సబ్బితి మోహనరావు పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక ఎంపీపీ కార్యాలయం, చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఎంపీడీఓ ఎ.మేరీరోజ్, వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆలమూరులో మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ పాల్గొని కార్మికులకు దుస్తులు అందజేశారు. చెముడులంకలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, సందిపూడిలో తోట భవానీ నేతృత్వంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పినపళ్లలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకృష్ణ ప్రభాస్ పేపర్ మిల్లు యాజమాన్యం ప్రతినిధులు వంక సత్యనారాయణ (అన్నవరం), వైట్ల దుర్గారావు, సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కుండ అన్నపూర్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పచ్చమట్ల రాజగోపాలరాజు ఆధ్వర్యంలో జెండా వందనం జరిగింది. ర్యాలి, నార్కెడ్‌మిల్లి, రాజవరం పంచాయతీ కార్యాలయాల వద్ద జెడ్పీటీసీ బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పాలా నాగేశ్వరరావు, కొల్లి శ్యామ్‌సన్‌లు జెండా ఆవిష్కరించారు. పులిదిండిలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జెండా వందనం జరిగింది. వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో స్వాతంత్ర్య సమరయోధుల స్తూపం వద్ద ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్, సర్పంచ్ పోచిరాజు బాబూరావు జెండా ఆవిష్కరించారు. అలాగే వివిధ కార్యాలయాల వద్ద వేడుకలు జరిగాయి.



అంతర్వేదిపాలెంలో 100 అడుగుల పొడవున్న జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

పి.గన్నవరం నియోజకవర్గంలో..

మామిడికుదురు: నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కుసుమ వనజకుమారి, నగరం పోలీస్ స్టేషన్ వద్ద ఏఎస్ఐ కృష్ణ, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ శరణ్య త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. పెదపట్నంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు.

పి.గన్నవరం: జి.పెదపూడి జెడ్పీ, నరేంద్రపురం గురుకులం, పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, సాయితేజ విద్యాసంస్థల ప్రాంగణాల్లో జాతీయ పతాకాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎగురవేశారు. నాయకులు గనిశెట్టి నాగలక్ష్మి, డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నాగుల్లంకలోని స్వాతంత్ర్య సమరయోధుల స్తూపానికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తదితరులు పూలమాలలు వేశారు.

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీపల్లవి, పోలీస్ స్టేషన్ వద్ద ఏఎస్సై బి.శ్రీనివాసరావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. చింతనలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎమ్మెల్యే సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అంబాజీపేట: గంగలకుర్రులో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయం, అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయం వద్ద జె.వెంకటేశ్వరి, మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అరిగెల బలరామ్మూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ శాంతకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందించారు.

మలికిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి ఆవిష్కరించారు. జాతీయ గీతాలను విద్యార్థులు, డ్వాక్రా సంఘాల సభ్యులు ఆలపించారు. మేడిచర్ల రాము, ఎంపీటీసీ సభ్యులు జక్కంపూడి శ్రీదేవి, కొప్పిశెటి సీతామహాలక్ష్మి, ఏపీఎం వరాల బాబు తదితరులు పాల్గొన్నారు. మలికిపురం పంచాయతీ వద్ద జరిగిన వేడుకలో సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ గుబ్బల బాబ్జి పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ జెండా ఆవిష్కరించారు.

రాజోలు: స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. రాజోలు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాయలం వద్ద తహసీల్దార్ ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కేతా శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సఖినేటిపల్లి: మండల పరిషత్ కార్యాలయం, మహిళా సమాఖ్య కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంపీపీ వీరా మల్లిబాబు జాతీయ జెండాలను ఎగుర వేశారు. కోఆప్షన్ సభ్యుడు బళ్ల నోబుల్ ప్రభాకర్, ఎంపీటీసీలు రాపాక దీవెన కుమారి, నల్లి రత్నకుమార్, ఎంపీడీఓ పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఎస్.రాము, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ జాతీయ జెండాలను ఎగుర వేశారు. మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ జి.శ్రీలక్ష్మి, సఖినేటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ కొండా కిశోర్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు అల్లూరు పెద బంగార్రాజు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. దంతులూరి సీతారామరాజు, డి.వర్మ సమకూర్చిన జాతీయ జెండాతో ర్యాలీని ఎస్ఎంసీ చైర్మన్ కమిడి ప్రసాద్ ప్రారంభించారు. మోరిపోడు సుబ్బారాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద జాతీయ జెండాను ఎన్నారై డాక్టర్ గెద్దాడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

దైవ సన్నిధిలో దేశభక్తి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ జెండా వందనం గావించారు. అనంతరం భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, అర్చకుడు పి.రామశేషాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు. సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఇన్‌చార్జి హెచ్ఎం గునెశెట్టి మల్లికార్జునరావు, అన్నపూర్ణ దంపతులు, పారిశుద్ధ్య కార్మికులు పి.అప్పారావు, వెంకటరమణ దంపతులను సత్కరించారు. సర్పంచ్ రేపూరి రాజేశ్వరి, రేపూరి యేసు నరసింహ రాజా, ఏపీ స్టేట్ ఎస్సీ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి పాల్గొన్నారు.



ముక్తేశ్వరంలో జెండాలతో చిన్నారుల సందడి



మామిడికుదురులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎంపీపీ వనజకుమారి



రాజోలు కోర్టు వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి



మలికిపురంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి



అంతర్వేది ఆలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య వేడుకలు

సేవలతో ప్రజల్లో గుర్తింపు



బదిలీపై వెళ్తున్న ఎస్సై శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

మామిడికుదురు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని నగరం ఎస్సై చైతన్యకుమార్, పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ అన్నారు. నగరం ఎస్సైగా విధులు నిర్వహించి మలికిపురం బదిలీ అయిన పి.సురేష్ వీడ్కోలు సభ బుధవారం రాత్రి నగరం పోలీస్ స్టేషన్‌లో జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్సైను ఘనంగా సన్మానించారు. సురేష్ విధి నిర్వహణలో ప్రజల మన్ననలు అందుకున్నారని కితాబిచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ప్రముఖులు కటకంశెట్టి ఆదిత్య, కొమ్ముల రాము, బొలిశెట్టి భగవాన్, మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు సత్కారం

సఖినేటిపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రామేశ్వరానికి చెందిన విశ్రాంత సైనికులు మత్తి లక్ష్మీనరసయ్య, ఎ.కృష్ణంరాజులను ఘనంగా సత్కరించారు. రామేశ్వరం పంచాయతీ వద్ద జరిగిన వేడుకల్లో ఆర్మీ విభాగంలో వేర్వేరు స్థాయిల్లో పనిచేసిన వారిని సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ దొంపాటి అన్నపూర్ణ సత్కరించారు. కాగా 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో మత్తి లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు. ఆర్మీ ఆయుధ వ్యవస్థలు, పరికరాల రూపకల్పనలో ఆయన సేవలందించారు.

అపూర్వ కలయిక



మలికిపురంలో కలుసుకున్న పదో తరగతి 1976-77 బ్యాచ్ విద్యార్థులు

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ఉన్నత పాఠశాలలో 1978–77లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. అలనాటి జ్ఞాపకాలను వారంతా నెమరవేసుకుని సందడి చేశారు. వారంతా చందాలు వేసుకుని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన రూ. లక్ష ద్వారా నెల నెలా వచ్చే వడ్డీతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఈ ఏడాది ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పెద్దలు డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి, డి.శ్రీహరిరాజు, దివ్వి సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, కాదులూరి రామకృష్ణ, సత్యానందం, కడలి కృష్ణార్జునుడు, మానేపల్లి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ మీటర్ ఏర్పాటు



మలికిపురంలో తొలి సోలార్ సిస్టమ్ మీటర్‌ను ప్రారంభిస్తున్న ఏఈ సతీష్

మలికిపురం: ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో రాయితీపై ఇస్తున్న సోలార్ సిస్టమ్ తొలి విద్యుత్ మీటర్‌ను గురువారం మలికిపురంలో ఏర్పాటు చేశారు. స్థానిక గెద్దాడ నాగేశ్వరరావుకు ప్రభుత్వం మంజూరు చేసిన సోలార్ విద్యుత్ మీటర్‌ను మలికిపురం విద్యుత్ శాఖ సిబ్బంది ఏర్పాటు చేయగా ఏఈ మద్దూరి సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఇప్పటి వరకూ వినియోగదారుడు నాగేశ్వరరావు నెలకు రూ.40 వేల వరకూ విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారన్నారు. ఇకపై ఆయనకు ఆ బిల్లు మినహాయింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం విద్యుత్ వినియోగదారులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అమ్మి, ఆదాయం సంపాదించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇది ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ కూడా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గెద్దాడ నాగేశ్వరరావు, ఎల్ఐ ఎం.సత్యనారాయణ, సూర్య సోలార్ సిస్టమ్స్ ఏజెన్సీ ప్రొప్రైయిటర్ దొడ్డా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం









మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న కొత్తపేట డిగ్రీ కళాశాల జేఏ సాయిబాబా, అయినవిల్లిలంక పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణమూర్తి, జి.పెదపూడి వీఆర్వో భగవాన్, పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆనందరావు



అమలాపురంలో అవార్డు అందుకుంటున్న ఏపీఓ నాగప్రసాద్

కొత్తపేట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణకు ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అలాగే ఆర్డీఓ కార్యాలయంలో ఐదుగురు ఉద్యోగులు ఉత్తమ సేవా పురస్కారాలు స్వీకరించారు.

వాడపాలెం గ్రామ సేవా కేంద్రంలో పశుసంవర్ధక సహాయకునిగా పనిచేస్తున్న బీర రమేష్‌కు ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ మూర్తి ఉత్తమ సేవా పురస్కారం అందించారు. రావులపాలెం సర్కిల్ కార్యాలయంలో హెచ్‌సీగా పనిచేస్తున్న డి.సుబ్రహ్మణ్యస్వామి ఎస్పీ కృష్ణారావు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీహెచ్ సత్యసాయిబాబా జిల్లా మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వీకేవీ ప్రభుత్వ కళాశాలలో బీకాం విద్యార్థిని ఆర్.బేబీసత్యవాణి శాస్త్రీయ నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. వీసీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

అయినవిల్లి: జిల్లా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అయినవిల్లిలంక పంచాయతీ కార్యదర్శి రేమళ్ల సూర్యనారాయణ మూర్తి పురస్కారం అందుకున్నారు. ఆయన్ని ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి, తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు అభినందించారు.

పి.గన్నవరం: పి.గన్నవరం మండలం జి.పెదపూడి వీఆర్వో కె.భగవాన్, పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కత్తుల ఆనందరావులు మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.

సఖినేటిపల్లి: మండల ఎన్ఆర్‌జేఈఎస్ ఏపీఓ ఎం.డి. నాగప్రసాద్‌కు ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. ఈ మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎస్.మధుసూదన్, ఏపీడీ మల్లికార్జునరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇదే విభాగంలో మండల జేఈగా పనిచేస్తున్న నేతల శ్రీనివాస్‌కు కూడా ఉత్తమ సేవా అవార్డు దక్కింది.